క్లుప్తంగా

పాముకాటుతో పాడి ఆవు మృతి



మృతి చెందిన పాడి ఆవు

మడకశిర: పాముకాటుతో పాడి ఆవు మృతి చెందిన ఘటన పట్టణంలోని 18వ వార్డు పరిధిలో జరిగింది. బొమ్మయ్యగారి చంద్ర అనే రైతుకు చెందిన పాడి ఆవు ఆదివారం పొలంలో మేత మేస్తుండగా పాము కాటు వేసింది. పాము కాటు వేయడంతో పాడి ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. దాదాపు రూ.లక్ష విలువ చేసే పాడి ఆవు చనిపోవడంతో బాధిత రైతు కన్నీటి పర్యంతమయ్యారు. పాడిఆవు ఇచ్చే పాలతోనే సదరు రైతు జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో పాడి ఆవు మృతి చెందడంతో ఎలా జీవనం సాగించాలంటూ రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తనకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరారు.

నెమలి వాహనంపై సుబ్రహ్మణ్యస్వామి



నెమలి వాహనంలో సుబ్రహ్మణ్యస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

పావగడ: నాగలమడక అంత్య సుబ్రహ్మణ్యం స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం స్వామివారిని నెమలి వాహనంలో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకుడు బదరీనాథ్ ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు 108 లీటర్ల పాలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మేళ తాళాల ధ్వనుల మధ్య నెమలి వాహనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామ వీధుల్లో స్వామివారి విగ్రహాన్ని ఊరేగించారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో చోటు





వీఎస్ పురుషోత్తమరెడ్డి   బి.గిరిధర్‌రాజు

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో మండల నాయకులకు చోటు దక్కింది. జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపీపీ వీఎస్ పురుషోత్తమరెడ్డిని నియమించారు. అలాగే యాక్టివిటీ కార్యదర్శిగా కోడూరుకు చెందిన గిరిధర్‌రాజుకు చోటు లభించింది. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌తో పాటు జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, నియోజకవర్గ సమన్వయకర్త దీపికలకు వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం

మడకశిర: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తనపై ఎంతో నమ్మకం ఉంచి జిల్లా అధికార ప్రతినిధిగా నియమించారన్నారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేసి కూటమి ప్రభుత్వ దురాగతాలను ప్రశ్నిస్తామన్నారు. సీఎం చంద్రబాబు తప్పుడు హామీలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తామని పేర్కొన్నారు. వైఎస్ జగన్ హయాంలో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసిన విషయాన్ని ప్రజలకు వివరించి తద్వారా పార్టీ బలోపేతం కృషి చేస్తామని చెప్పారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'కువెంపు'నకు ఘన నివాళి



ప్రమోద్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: వైవిధ్యంతో కూడిన కథ, కవిత, నవల, నాటకం, మహాకావ్యం తదితర ప్రక్రియలతో కన్నడ భాష కీర్తి పతాకాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఎగుర వేసిన ఘనత కేవలం రస రుషి, రాష్ట్ర కవి, ప్రథమ జ్ఞాన పీఠ అవార్డు గ్రహీత కువెంపు దేనని స్థానిక ప్రముఖ కవి హోమా నాగరాజు కొనియాడారు. పట్టణంలోని ఎస్ఎస్‌కే డిగ్రీ కళాశాలలో ఆదివారం కువెంపు 120వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కసాప అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కన్నడ భాషను చదివే అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కసాప కార్యదర్శి కే రంగప్ప మాట్లాడుతూ తాలూకా వ్యాప్తంగా కన్నడ జాగృతి కార్యక్రమాలను నిర్వహిస్తున్న కన్నడ సాహిత్య పరిషత్ కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కన్నడ భాష అభివృద్ధికి కృషి చేస్తున్న జీటీ ప్రమోద్‌కుమార్‌ను సన్మానించారు.

సంక్షోభంలో సంక్షేమం

- వసతి గృహాల్లో విద్యార్థులకు తప్పని ఇక్కట్లు
- కొడిగెనహళ్లి బీసీ హాస్టల్‌లో వసతుల లేమి
- పరిగిలో ఒకే భవనంలో ఎస్సీ, బీసీ హాస్టళ్ల నిర్వహణ



శిథిలమై నిరుపయోగంగా మారిన పరిగి ఎస్సీ హాస్టల్



ఆరుబయట స్నానం చేస్తున్న విద్యార్థులు

పరిగి: విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు నేడు పథకంతో పాఠశాల భవనాల రూపు రేఖలు మారాయి. అనంతరం ఏర్పడిన కూటమి సర్కార్ ప్రభుత్వ బడుల అభివృద్ధిపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈక్రమంలో వసతి గృహాలను పూర్తిగా విస్మరించినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిగి మండలంలో ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లతో పాటూ కేజీబీవీ, ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల, ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ ఉన్నాయి. కాగా కొడిగెనహళ్లి, పరిగిలో వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు పలు మౌలిక పరమైన వసతుల కల్పనలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఒకే భవనంలో రెండు హాస్టళ్లు!

పరిగి మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ హాస్టళ్లు ఉన్నాయి. అయితే గత నలభై ఏళ్ల క్రితం అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు ప్రభుత్వ హయాంలో ఎస్సీ హాస్టల్ నిర్మించారు. అయితే కాలక్రమంలో అది శిథిలావస్థకు చేరుకుంది. ఈ క్రమంలో సొంత భవనం లేకపోవడంతో బీసీ హాస్టల్ భవనంలోనే ఎస్సీ హాస్టల్‌కు చెందిన విద్యార్థులకు ఆశ్రయం కల్పిస్తున్నారు. కాగా రెండు వసతి గృహాలను ఒకే భవనంలో నిర్వహిస్తుండటంతో అటు విద్యార్థులకు ఇటు వార్డెన్‌లకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బీసీ, ఎస్సీ హాస్టళ్లు రెండూ ఒకే భవనంలో ఉండటం వల్ల విద్యార్థులకు అవసరమైన గదులు లేవు. ప్రస్తుతం ఎస్సీ హాస్టల్‌లో 48 మంది, బీసీ హాస్టల్‌లో 90 మంది విద్యార్థులు ఉన్నారు. వేర్వేరు భవనాలు ఉంటే సంఖ్య మరింత ఎక్కువగా ఉండేది.

బీసీ హాస్టల్‌లో సమస్యలు

కొడిగెనహళ్లి బీసీ హాస్టల్‌లో మౌళిక వసతుల లేమి చాలా దారుణంగా ఉంది. 1986లో అప్పటి మంత్రి ఎస్ రామచంద్రారెడ్డి (ప్రస్తుత బీసీ సంక్షేమ, చేనేత జౌళీ శాఖ మంత్రి సవిత తండ్రి), ఎమ్మెల్యే సీసీ వెంకట్రాముడు ప్రారంభించారు. ప్రస్తుతం ఈభవనంలో గదులకు నెర్రెలు రావడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనన్న భయందోళనలు కలుగుతున్నాయి. ఇక మరుగుదొడ్ల నిర్వహణపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. మరుగుదొడ్డికి నిర్మించిన గుంతపై మూత ఏర్పాటు చేయలేదు. ఈవిషయాన్ని వార్డెన్ దృష్టికి తీసుకెళ్లగా మరుగుదొడ్డి గదులకు తాళాలు వేయించారు. దీంతో చేసేది లేక విద్యార్థులు మల, మూత్ర విసర్జనకు బయటకు వెళ్తున్నారు. 2024-25 విద్యా సంవత్సర ప్రారంభంలో దాదాపు 180 మంది విద్యార్థులు ప్రవేశం పొందగా మౌలిక వసతుల లేమి కారణంతోనే 40 మందికి పైగా హాస్టల్‌లో ఉంచకుండా తల్లిదండ్రులు తిరిగి తీసుకెళ్లారంటే ఇక్కడి పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.



పరిగిలో ఒకే భవనంలో ఉన్న బీసీ, ఎస్సీ హాస్టళ్లు

విద్యార్థులంటే ఇంత నిర్లక్ష్యమా ?



కూటమి ప్రభుత్వమేర్పడ్డాక విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదు. హాస్టల్‌లలో మౌలిక వసతుల కల్పనలో చొరవ చూపకుండా నిర్లక్ష్యం వహిస్తోంది. గతంలో నాడు నేడు పథకంతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అప్పటి ప్రభుత్వం పెద్ద పీట వేసింది. ఫలితంగా పాఠశాలల రూపు రేఖలు మారాయి. ప్రస్తుత ప్రభుత్వం నాడు నేడు పథకాన్ని కొనసాగించలేదు. కొడిగెనహళ్లి బీసీ హాస్టల్‌లో లెట్రిన్ పిట్‌కు కనీసం మూత లేకపోవడంతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై ప్రభుత్వ పెద్దలు ఇప్పటికైనా స్పందించాలి. అలాగే జిల్లాలోని అన్ని హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పనకు నిధులు కేటాయించి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. – బాబావలి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

వసతులు కల్పించాలి

కొడిగెనహళ్లి బాలుర వసతి గృహంలో సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. డ్రైనేజీ, లెట్రిన్, బాత్రూమ్, గదులు తదితర వసతులు సరిగా లేవు. విద్యార్థులు బహిర్భూమికై బయటకు వెళ్తున్నారు. ఇది చాలా దారుణం. ముఖ్యంగా రాత్రి వేళల్లో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొరపాటున ఏ విషకీటకమైనా విద్యార్థులను కుడితే పరిస్థితి ఊహించడానికే భయమేస్తోంది. ప్రభుత్వం ఇప్పటికైనా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.
– పూజిత, ఏఐడీఎస్ఓ జిల్లా నాయకురాలు

భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు



ఈరలక్కప్ప

మడకశిర: నియోజకవర్గ ప్రజలకు భోగి, సంక్రాంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి రైతులు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలకు అన్ని విధాలుగా మంచి జరగాలని దేవుడిని ప్రార్థినట్లు చెప్పారు.

గౌడనహళ్లిలో క్రికెట్ పోటీలు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని గౌడనహళ్లిలోని క్రీడా మైదానంలో గ్రామీణ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. సంక్రాంతి సందర్భంగా రెండు రోజులు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని క్రీడాకారులు తెలిపారు. ఇతర ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార నిమిత్తం స్థిరపడిన వారు సైతం పోటీల్లో పాల్గొంటున్నారు.

మైనేని వెంకటరత్నం దార్శనికుడు

పెనుకొండ: ఐక్యోపాధ్యాయ పత్రికా సంపాదకులు మైనేని వెంకటరత్నం గొప్ప దార్శనికుడని యూటీఎఫ్ నాయకులు కొనియాడారు. మైనేని వెంకటరత్నం వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఎంఎస్ఆర్ రెసిడెన్సీలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మైనేని చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, సుధాకర్, నరేష్, మారుతీ శ్రీనివాస్, అనిల్‌కుమార్, సుబ్బారెడ్డి, భూతన్న, డి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కురుబవాండ్లపల్లిలో 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ'



కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని కురుబవాండ్లపల్లిలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలికి గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఉషశ్రీచరణ్ గడప గడపకూ తిరిగి సమస్యలను తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో ప్రజలకు మంచి చేసే ప్రభుత్వం వస్తుందన్నారు. మంచి చేసే ప్రభుత్వానికే మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, వైస్ సర్పంచ్ రత్నమ్మ, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ నరసింహులు, నాయకులు వైశాలి జయశంకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చెన్నకేశవులు, నరసింహులు, మూర్తి, రామాంజినేయులు, పూజారి నాగేంద్ర, ఆంజనేయులు, రవీంద్ర, బొగ్గు నరసింహులు, నాగరాజు, అనిత, మల్లికార్జున, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నిందలు మాని హామీలు నెరవేర్చండి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



పెనుకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి మంత్రి సవితకు లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గోరంట్ల మండలంలో గోకులం ప్రారంభానికి వెళ్లిన మంత్రి సవిత.. మాజీ సీఎం జగన్‌ను విమర్శించడం సరికాదన్నారు. శవాలపై రాజకీయాలు చేసే సంస్కృతి తమ పార్టీకి, నాయకులకుదీ కాదన్నారు. రాష్ట్రానికి ఎవరు ఐరెన్ లెగ్గో టీడీపీ నాయకులు గుర్తించాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తిరుపతిలో ఆరుగురు చనిపోవడానికి కారణమెవరో చెప్పాలన్నారు. గతంలో ఎవరి హయాంలో విజయవాడ పుష్కరాల్లో అధిక సంఖ్యలో భక్తులు చనిపోయారో గమనించాలన్నారు. ఎవరు ఐరన్ లెగ్ అనే దానిపై మంత్రి సవిత ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీపై నిందలు వేయడం మాని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



అంబేద్కర్‌సర్కిల్ వద్ద వివేకానంద జయంతిని నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

హిందూపురం: దేశ ప్రజల ఆధ్యాత్మిక దిక్సూచి, యువతకు మార్గదర్శి స్వామి వివేకానంద అని పలువురు కొనియాడారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. 11వ వార్డు కౌన్సిలర్ అంజలి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. హిందూపురంలో ఇండియన్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ కరాటే మాస్టర్ రామచంద్ర ఆధ్వర్యంలో ఎంజీఎం హైస్కూల్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి స్వామి వివేకానంద జయంతి ఘనంగా నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి వినూత్న నిరసన



అర్ధనగ్నంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేస్తున్న కార్మికులు

హిందూపురం టౌన్: మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఆదివారం మున్సిపల్ కార్యాలయం వద్ద వినూత్న నిరసనకు దిగారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ అర్ధనగ్నంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాము మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడు నెలలు గడిచినప్పటికీ కార్మిక సమస్యలపై మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెలుగుదేశం నాయకులు సమ్మెలు చేస్తున్న కార్మికుల దీక్షా శిబిరాల్లోకి వచ్చి సంపూర్ణ మద్దతు ప్రకటించారన్నారు. తాము అధికారంలోకి వస్తే సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే బాలకృష్ణ కార్మికుల టెంటులో కూర్చొని మీడియా సమక్షంలో కార్మికుల సమస్యలపై మాట్లాడి అండగా ఉంటామని హామీ ఇచ్చారన్నారు. కార్మికులు గత మూడు రోజుల నుంచి రోడ్డు పక్కన కూర్చొని నిరసన తెలియజేస్తున్నా కూటమి నాయకులు మద్దతు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రభుత్వ పెద్దలతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే 16వ తేదీ నుంచి కార్మికులు రాష్ట్ర వ్యాప్త సమ్మెలోకి వెళ్లడం ఖాయమన్నారు. హిందూపురం మున్సిపల్ యూనియన్ కార్యదర్శి జగదీష్, అధ్యక్షుడు మల్లికార్జున, కోశాధికారి ఆనంద్, జాయింట్ సెక్రెటరీ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌ను కలిసిన రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తదితరులు



వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్పను సన్మానిస్తున్న మడకశిర రూరల్ కన్వీనర్ రామిరెడ్డి

రొళ్ల: వైఎస్సార్‌సీపీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడానికి సమిష్టిగా కృషి చేద్దామని నూతనంగా నియమితులైన ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శివప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని హెచ్‌ఎం పల్లి గ్రామంలోని మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడు స్వగృహం ఆవరణలో నూతనంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ శివప్రసాద్‌ను పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. శివప్రసాద్ మాట్లాడుతు తనపై నమ్మకం ఉంచి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌తో పాటు జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, సమన్వయకర్త ఈరలక్కప్పకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ సంఘం అధ్యక్షుడు రంగేగౌడు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: మడకశిర మండల రూరల్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌గా రామిరెడ్డికి మరోసారి అవకాశం ఇచ్చింది. దీంతో ఆదివారం నాయకులు, కార్యకర్తలు చెందకచెర్ల గ్రామంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో పని చేయాలన్నారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు.

గుడిబండ: మడకశిరరూరల్ మండలం వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌గా మరోసారి నియమితులైన రామిరెడ్డి, నూతనంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన ఆనందరంగారెడ్డి తదితరులు ఆదివారం సాయంత్రం గుడిబండ మండలం ఫళారం చేరుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్పకు శాలువ కప్పి పూలమాల వేసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణ్‌రెడ్డి, రాణాప్రతాప్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, సుబ్బు, నాని తదితరులు పాల్గొన్నారు.

ఉషశ్రీచరణ్‌కు కృతజ్ఞతలు తెలిపిన నాయకులు

పెనుకొండ రూరల్: ఇటీవల నూతనంగా ఎంపికైన వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల అధ్యక్షులు, మండల కన్వీనర్లు ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌ను కలిశారు. పెనుకొండలోని వైఎస్సార్‌సీపీ కార్యాయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో భాగంగానే రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కూడా ఉషశ్రీచరణ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సానే రాజా, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నీరుగంటి నారాయణరెడ్డి, రాప్తాడు మండల కన్వీనర్లు, జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు నల్లమాడ గంగిరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి పరిగి నరసింహమూర్తి, జిల్లా యాక్టివిటీ సెక్రటరీలు తురకలాపట్నం గుట్టి నరేంద్ర, సోమందేపల్లి ఆంజనేయులునాయక్, జిల్లా జనరల్ సెక్రటరీ ధర్మవరం కోటి సురేష్, జిల్లా అధికార ప్రతినిధి మడకశిర ఆనందరంగారెడ్డి, సోమందేపల్లి మండలం పట్టణ, కన్వీనర్లు గజేంద్ర, శ్రీనివాసులు, షేక్ ఇమామ్, శ్రీరాములు, సూర్యప్రతాప్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: మండల పరిధిలోని కె.బ్యాడిగెరకు చెందిన మండల జేసీఎస్ కన్వీనర్ లోకేష్‌ను పార్టీ అధిష్టానం వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యదర్శిగా నియమించిన విషయం తెలిసిందే. ఆదివారం సాయంత్రం ఆయన ఫళారం గ్రామానికి చేరుకుని సమన్వయకర్త ఈరలక్కప్ప కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన వెంట హులికుంట వైస్ సర్పంచ్ రవికుమార్, నాయకులు శశికుమార్, రవికుమార్, ముద్దారెడ్డి, మంజునాథ్ తదితరులున్నారు.



హెచ్‌ఎం పల్లిలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శివప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

మాజీ కౌన్సిలర్ మృతి



వెంకటస్వామి (ఫైల్)

హిందూపురం అర్బన్: హిందూపురం మాజీ మున్సిపల్ కౌన్సిలర్, వ్యాపారి జేఈ వెంకటస్వామి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. కాంగ్రెస్‌తో పాటు తెలుగుదేశం పార్టీలోనూ ఆయన చాలాకాలం పాటు కీలక పదవుల్లో కొనసాగారు. ఆయన తనయుడు అనిల్‌కుమార్ మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశారు. వెంకటస్వామిని చివరిసారి చూసేందుకు పట్టణ ప్రముఖులు, వ్యాపారులు, ప్రజలు తరలివచ్చారు.

పశువుల షెడ్డు ప్రారంభించిన మంత్రి

గోరంట్ల: మండల పరిధిలోని తప్పారాజుపల్లి గ్రామంలో పాడి రైతు లక్ష్మీబాయి ఉపాధి హామీ నిధులు రూ.2.07 లక్షలతో నిర్మించిన పశువుల షెడ్డును మంత్రి సవిత ఆదివారం ప్రారంభించారు. అనంతరం మండల పరిధిలోని యర్రయ్యగారిపల్లి నుంచి మేరెడ్డిపల్లి వరకూ రూ.1.14 కోట్ల నిధులతో చేపట్టిన తారు పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

యువకుల ఆధ్వర్యంలో రోడ్డు పనులు



అమరాపురం మండలం గౌడనకుంటలో రోడ్డుపై మట్టి వేయిస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలోని గౌడనకుంట డెవలప్‌మెంట్ ఫోరమ్ ఆధ్వర్యంలో రోడ్డుకు మట్టి తరలించారు. మండలంలోని గౌడనకుంటకు చెందిన యువకులు వివిధ ప్రాంతాల్లో ఉపాధి కోసం వృత్తి రీత్యా స్థిర పడ్డారు. వారు సంక్రాంతి పండుగ కోసం ప్రతి యేటా స్వగ్రామానికి వస్తుంటారు. వచ్చిన ప్రతిసారి అమరాపురం చెరువు కట్ట తూము నుంచి గౌడనకుంట గ్రామం వరకూ ఉన్న రోడ్డు అధ్వానంగా ఉండడంతో మట్టిని తరలించి చదును చేస్తుంటారు. ఈసారి కూడా ఆ పనికి పూనుకున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

హిందూపురం డివిజన్
9912220717, 9912220723
9705346587, 9912220726